

వామ్మో.. ఈజీఎస్ పనులా!

ఈజీఎస్ పనులంటేనే ప్రజా ప్రతినిధులు, నాయకులు హడలిపోతున్నారు. చేసిన పనులకు నేటికీ బిల్లులు రాకపోవడమే కారణం. 8లో▸



నగరానికి వెళ్లాలంటే..

నగరానికి వెళ్లాలంటే అడాల్‌పూర్ పరిధిలో ఉన్న కాకరవేణి నది దాటాల్సిందే.. నది ఇటు వైపు ఉన్న గ్రామీణులకు అన్నీఇబ్బందులే.. 8లో▸



కాలనీల అభివృద్ధికి కృషి

పరిగి పట్టణంలోని కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రెగ్యులరైజ్ చేయాలని వినతి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాలకేంద్రం సిబ్బంది

అనంతగిరి: ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని బాలకేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది మంత్రి సబితా రెడ్డిని కోరారు. ఈమేరకు వారు మంత్రికి వినతిపత్రం అందజేశారు. తాము ఇరవై ఏళ్లుగా విధుల్లో కొనసాగుతున్నామని చెప్పారు. నేటికీ చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నామన్నారు. ఇదే వృత్తిపై ఆధారపడి ఉన్నందున వేతనాలు సరిపోక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. రెగ్యులరైజ్ చేసి సమస్యలు తీర్చాలని కోరారు. బాలకేంద్రంను బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, అనురాధ, శ్రీనివాస్, స్రవంతి, స్వప్న తదితరులు ఉన్నారు.

రెడ్డి జాగృతి నాయకుల పరామర్శ



ఎస్పీ కోటిరెడ్డితో రెడ్డి జాగృతి నాయకులు

బంట్వారం: ఎస్పీ కోటిరెడ్డిని రెడ్డి జాగృతి నాయకులు కలిశారు. ఇటీవల ఎస్పీకి పితృ వియోగం కలిగిన విషయం విదితమే. ఈ క్రమంలో రెడ్డి జాగృతి నాయకులు, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, యాచారం ఎంపీటీసీ ప్రశాంతి శరణారెడ్డి ఆదివారం ఎస్పీ స్వగ్రామం మాదారానికి వెళ్లి కోటిరెడ్డిని పరామర్శించారు. హన్మారెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. ఎస్పీని పరామర్శించిన వారిలో రెడ్డి జాగృతి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

జేపీదర్గాలో ప్రార్థనలు అజ్మీర్‌దర్గాకు చాదర్



చాదర్‌ను తీసుకెళ్తున్న మైనార్టీ నాయకులు

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ జేపీదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన చాదర్‌ను పలువురు మైనార్టీ నాయకులు ఆదివారం రాజస్థాన్‌లోని అజ్మీర్‌దర్గాకు తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించే ఉర్సు ఉత్సవాల్లో భాగంగా బాబాకు చాదర్ సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమూద్, నసీర్, పాషా, ఘనీ, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇంద్రసేనారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గుర్రం ఇంద్రసేనారెడ్డి ఎన్నికయ్యారు. నగరంలో ఆదివారం పంచాయతీరాజ్ ఇంజనీర్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు ఇంజనీర్‌గా పని చేస్తున్న ఇంద్రసేనారెడ్డిని రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పెద్దలను కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. 33 జిల్లాల నుంచి 350 మంది ఇంజనీర్లు సమావేశానికి హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేందుకు కృషిచేస్తానని స్పష్టంచేశారు.

మాణిక్‌ఠాక్రేకు కాంగ్రెస్ నేతల స్వాగతం

కొత్తూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌ఠాక్రేకు షాద్‌నగర్ నాయకులు ఆదివారం తిమ్మాపూర్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లిలో నిర్వహించిన దళితగిరిజన ఆత్మగౌరవ సభకు వెళ్తున్న నేతలకు స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు వీర్లపల్లి శంకర్, బాబార్‌ఖాన్, బాల్‌రాజుగౌడ్ హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, మహేందర్, అంతయ్య, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

అమ్ముదామా.. ఆగుదామా?



జీవన్గీలోని ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

పత్తి రైతుల్లో అయోమయం

- రోజురోజుకూ తగ్గుతున్న ధరలు
- రూ.9 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయిన రేటు
- ఇళ్లల్లోనే పేరుకుపోయిన తెల్లబంగారం
- రైతుల వద్దే 20 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు

బషీరాబాద్: పత్తి రైతు మళ్లీ పరేషాన్‌లో పడ్డాడు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధర దక్కక దిగాలు చెందుతున్నాడు. చేతికందిన పంటను అమ్ముకుందామని వెళితే మార్కెట్ మాయాజాలంలో కుదేలవుతున్నాడు. గత సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు 50శాతం మేర పంట పాడైపోగా.. చేతికందిన కొద్ది దిగుబడిని అమ్మబోతే ధర అమాంతం తగ్గిపోయింది. నవంబర్ మొదటి వారంలో క్వింటాలుకు గరిష్టంగా రూ.9 వేలు పలికింది. ఆతర్వాత జిన్నింగ్ మిల్లుల యజమానులు సిండికేట్‌గా మారి డిసెంబర్ చివరి నాటికి రూ.7,500 వద్ద స్థిరీకరించారు. ఈ ధరలు ప్రభుత్వ మద్దతు ధర కన్నా ఎక్కువగా ఉండటంతో సీసీఐ కొనుగోలు సెంటర్లు ప్రారంభించలేదు. ధర పెరుగుతుందనే ఆశతో ఉన్న రైతులు.. పత్తి అమ్ముదామా.. ఆగుదామా..? అనే డోలాయమానంలో రైతులు ఊగిసలాడుతున్నారు. తగ్గిన ధరలను చూసి ఇళ్లలోనే నిల్వ చేశారు. సంక్రాంతి తర్వాత మళ్లీ రూ.9 వేల మార్క్ దాటుతుందని భావిస్తున్నా మార్పు కానరావడంలేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 22 వేల మెట్రిక్ టన్నులకు పైగా పత్తి నిల్వలు ఇళ్లల్లోనే పేరుకుపోయాయి.

21,470 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

జిల్లాలో ఈ ఏడాది 51 వేల హెక్టార్లలో సుమారు 65 వేల మంది రైతులు పత్తి పంట వేశారు. మొదటి నుంచి అనేక వ్యయప్రయాసలకు గురయ్యారు. చేతికి వచ్చిన కాస్త దిగుబడులను విక్రయిద్దామంటే సరైన ధర లేక సతమతమవుతున్నారు. మొదటి దశలో తీసిన పత్తిని రూ.9 వేలకు క్వింటాలు చొప్పున కొనుగోలు చేసిన వ్యాపారులు ఆతర్వాత అమాంతం తగ్గించారు. దీంతో రైతులెవరూ పంట అమ్మేందుకు ఆసక్తి చూపడంలేదు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని మిల్లులలో ఈనెల 12వరకు 21,470 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. డిసెంబర్ చివరి వారం పత్తి ధర రూ.7,500 పడిపోవడంతో విక్రయాలు మందకొడిగా సాగాయి. సంక్రాంతి తర్వాతా ధరలు పెరుగుతాయనుకున్న రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. జనవరి మొదటి వారంలో రూ.8,300 ఉండగా పండగా తర్వాత మరో రూ.300 తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ఫెర్టిలైజర్ షాపుల నిర్వాహకులు మందుల ఖాతా కింద కొనుగోలు చేస్తున్న పత్తికి మరింత తక్కువ ధర పెడుతున్నారు. ఈ క్రమంలో రైతులు క్వింటాలుకు రూ.1,500 వరకు నష్టపోతున్నారు. కొంతకాలం ఆగితే డిమాండ్ పెరిగే అవకాశం ఉందని భావిస్తున్న పెద్ద రైతులు ఇప్పటికీ పింజ పత్తిని కూడా విక్రయించలేదు. చిన్న, సన్నకారు రైతులు మాత్రం కూలీలకు చెల్లించేందుకు డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు. ధర మరింత పడిపోతే భారీ నష్టాలు తప్పవని అధికారులు చెబుతున్నారు.

200 క్వింటాళ్లు నిల్వ చేశా



నేను 40 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. మొదటి దశలో తీసిన 100 క్వింటాళ్ల పత్తిని రూ.8,500 క్వింటాలు చొప్పున విక్రయించా. ధరలు పడిపోవడంతో మరో 200 క్వింటాళ్ల పత్తిని అమ్మకుండా నిల్వచేశాను. సంక్రాంతి తర్వాత ధరలు పెరుగుతాయని ఆశించాం. ప్రస్తుత ధరకు అమ్ముకుంటే పెట్టుబడి కూడా అందే పరిస్థితిలేదు.

– వీరారెడ్డి, రైతు, జీవన్గీ

ధర కోసం చూస్తున్నాం



పదెకరాల్లో పత్తి పండించా. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టా. అధిక వర్షాలతో దిగుబడి సరిగ్గా రాలేదు. తీసిన పత్తిని అమ్ముకుందామంటే ధర లేదు. 30 క్వింటాళ్ల పత్తిని రెండు నెలలుగా ఇంట్లోనే నిల్వ పెట్టుకున్నాం. ధర పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. అప్పుల పాలయ్యే ప్రమాదం ముంచుకొచ్చినట్లే.

– తలారి బక్కప్ప, మంతట్టి

ధర వస్తే అమ్ముకోండి

జిల్లా సుమారు 51వేల హెక్టార్లలో పతి సాగు చేసినట్లు సమాచారం. రైతులు ఇప్పటికే 22 వేల మెట్రిక్ టన్నుల పత్తిని విక్రయించారు. మొదటి దశలో తీసిన పత్తికి మంచి ధర లభించింది. సీజన్ ప్రారంభంలో రూ.9 వేలు, రూ.8వేల ధర పలికింది. సంక్రాంతి తర్వాత రేట్లు మరింత తగ్గాయి. రానున్న రోజుల్లో మంచి ధర వస్తే అమ్ముకోవడమే మంచిది. ఎక్కువ రోజులు నిల్వ ఉంచడంతోనూ నష్టాలే ఉంటాయి.

– సారంగపాణి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి

బడి బయట 302 మంది

- తిరిగి చేర్పించేందుకు చర్యలు
- చదువును మధ్యలో మానేస్తున్నది బాలురే



బడి మానేసిన పిల్లల వివరాలు సేకరిస్తున్న ఆర్పీలు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించడమేకాక.. వసతి గృహాల్లోనూ అందరికీ అడ్మిషన్లు ఇస్తున్నా ఇంకా చాలా మంది బడిబయటే ఉన్నారు. చాలా గ్రామాల్లో చదువును మధ్యలో మానేస్తున్న వారు అధికంగా ఉన్నారు. పదిహేను రోజులుగా విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో జిల్లా వ్యాప్తంగా 302 మంది బడి బయట ఉన్నట్లు తేలింది. ఆయా మండలాల్లోని ఆర్పీలు గ్రామాలకు వెళ్లి ఎంత మంది బడి బయట ఉన్నారనే విషయంపై సర్వే నిర్వహించారు. బడి మానేస్తే ఎందుకు మానేశారనే విషయాన్ని కూడా ఆరా తీశారు. జిల్లాలో 6 నుంచి 14 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలు 155 మంది బడి బయట ఉన్నట్లు తేలింది. ఇందులో 96 మంది బాలురు ఉండగా 59 మంది బాలికలు ఉన్నారు. బడి మానేసిన బాలికల తల్లి దండ్రులతో మాట్లాడి దగ్గరలోని కేజీబీవీల్లో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. బాలురను దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలలో లేక సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. 155 మంది పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. అదేవిధంగా 15 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు 147 మంది బడి బయట ఉన్నారు. ఇందులో 91 మంది బాలురు ఉండగా, 56 మంది బాలికలు ఉన్నారు. ఇందులో కళాశాల స్థాయి విద్యార్థులే ఉండటంతో వారిని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లేక రెసిడెన్సియల్ పాఠశాలల్లో చేర్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చదువును మధ్యలో మానేసిన వారిలో బాలురే అధికం. ఎక్కువగా మారుమూల గ్రామాల విద్యార్థులు చదువుకు మధ్యలోనే స్వస్తి చెబుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 302 మంది విద్యార్థులను ఆయా పాఠశాలల్లో, వసతిగృహాల్లో చేర్పించి చదువు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు.

సకాలంలో బిల్లులు చెల్లించండి

విద్యుత్ ఎస్ఈ జయరాజ్



మాట్లాడుతున్న ఎస్ఈ జయరాజ్

అనంతగిరి: విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విద్యుత్ ఎస్ఈ జయరాజ్ అన్నారు. ఆదివారం విద్యుత్ బిల్లుల వసూళ్లపై వికారాబాద్, నవాబ్‌పేట, ధారూరు, పూడూరు మండలాలకు చెందిన విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు తప్పకుండా బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అనధికారికంగా విద్యుత్ వాడి కేసు నమోదు అయిన సర్వీసులకు తక్షణమే సరఫరాను నిలిపివేయాలని ఎస్ఈ సూచించారు. సమావేశంలో డీఈ సంజీవ్, ఏడీ సత్యనారాయణరెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



వెంకయ్య నాయుడును సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు, చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చిచ్చుపెట్టే శక్తుల్ని దూరం పెట్టాలి

సాక్షి, సిటీబ్యూరో/ఖైరతాబాద్: కులం, మతం, భాష, వర్ణం, వర్గం పేర్లతో ప్రజల్ని విభజించే వ్యక్తుల్ని, శక్తుల్ని దూరం పెట్టాల్సిన అవసరం ఉందని మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో భారతమాత మహాహారతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మన భూమి వీరుల పురుటిగడ్డ, ఇక్కడి వీరులంతా శాంతి కోసం జీవితాలు త్యాగం చేశారే తప్ప యుద్ధ కాంక్షతో కాదన్నారు. చరిత్ర తిరగవేస్తే యుద్ధాల్లో భారతీయులు సాధించిన విజయాలు కనిపిస్తాయి కానీ అవేవీ మన దేశ విస్తీర్ణం పెంచుకోవాలని చేయలేదని గుర్తు చేశారు. శాంతి అహింస మన రక్తంలో ఉన్నాయన్నారు. విశాల భారతదేశం తత్వ గణిత శాస్త్రాల్లో ప్రపంచానికే తల్లిగా ఉండేదన్నారు. లాభదాయకమైన వ్యవసాయంతో, సుసంపన్నంగా, కళాసంపదతో ఉన్న మన దేశంలో బ్రిటిషర్లు ప్రవేశించి మనల్ని అన్ని రకాలుగా దోచుకున్నారన్నారు. వారిపై జరిపిన పోరాటాలు, వీరుల త్యాగాల నుంచి యువతరం స్ఫూర్తి పొందాలనేది తన ఆకాంక్ష అన్నారు. తాను విదేశాలకు వెళ్లినప్పుడు తన సాదా సీదా దుస్తులు చూసి ఎవరూ అగౌరవపరచలేదు కాబట్టి కన్నతల్లిని, మాతృభూమిని, మాతృభాషని మనం ఎప్పుడూ మరచిపోకూడదని ఉద్బోధించారు. మనదైన సంస్కృతి, సంప్రదాయం, సంగీతం, 64కళలను గౌరవించుకోవాలన్నారు. మాతృభాష కళ్లలాంటిది, పరాయి భాష కళ్లద్దాల్లాంటివని.. తెలిపారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయులు టంగుటూరి, అల్లూరి, కొమరంభీమ్, కట్ట బ్రహ్మణ జీవిత చరిత్రలు మన చరిత్రలో భాగం కావాల్సి ఉందన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో హైడ్రామా

- నాటకీయ పరిణామాల మధ్య అధ్యక్షుడి ఎన్నిక
- ఎలక్షన్ చెల్లదంటూ ఖండించిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ ఘని

తాండూరు: లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నికలో హైడ్రామా చోటుచేసుకుంది. ఆదివారం లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సుమారు 50 మంది సభ్యులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభ సమయంలోనే ప్రతినిధి ముస్తఫా పటేల్ కొత్త అధ్యక్షుడి నియామకానికి అనుకూలంగా ఉన్న వారు మద్దతు తెలపాలని సభ్యులను కోరారు. దీంతో సభ్యులు చేతులు పైకి ఎత్తారు. అనంతరం ముస్తఫా పటేల్ అధ్యక్షుడిగా హకీం ఖాన్ పేరును ప్రతిపాదించారు. తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్న అబ్దుల్ ఘని ఇంకా రాజీనామా చేయలేదని పలువురు సభ్యులు తెలిపారు. సమావేశానికి హాజరైన అబ్దుల్ ఘని మాట్లాడుతూ.. కార్యవర్గ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదని, కమిటీ సభ్యులతో చర్చించి రాజీనామాపై నిర్ణయం తీసుకొంటామని చెప్పారు. 'నేనే అధ్యక్షుడిగా ఉండాలంటూ' సభ్యుల నుంచి వత్తిడి వస్తోందని, కానీ వ్యక్తిగత పనుల వల్ల పదవికి న్యాయం చేయడం కష్టం అవుతోందన్నారు. అందు కోసం కొత్త కమిటీ ఏర్పాటు చేయడమే మంచిదన్నారు. ఈ విషయమై ముస్తఫా పటేల్ నిరాకరించారు. అధ్యక్షుడిని మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నుకుందామని పాత కమిటీ సభ్యులు అలాగే కొనసాగాలన్నారు. దీంతో ప్రతినిధుల మధ్య వాగ్వాదం జరిగింది. మరోవైపు ముస్తఫా ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన పలువురు కొత్త అధ్యక్షుడిగా హకీం ఖాన్ ప్రకటిస్తూ సన్మానం చేశారు. నాటకీయంగా చేసిన ఎన్నిక చెల్లదని ఈ నెలాఖరు వరకు అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉందన్నారు. సభ్యత్వం పూర్తయ్యేకే నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని అబ్దుల్ ఘని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అలీం సభ్యులున్నారు.

29న మెగా జాబ్ ఫెయిర్

- నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం
- మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు

కొడంగల్: అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం మెగా జాబ్ ఫెయిర్– 2023 నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో మెగా జాబ్ మేళా జరుగుతుందన్నారు. శ్రేయాన్ కన్సల్టెన్సీ సర్వీసెస్ వారి సహకారంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి పట్టణంలోని మురహరి (కేఎస్‌వీ) ఫంక్షన్ హాల్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 50కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన రెండు వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు వారి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రావాలన్నారు. కంప్యూటర్, టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ ఇతర నైపుణ్యాలు ఉంటే వాటి సర్టిఫికెట్లు కూడా చూపించాలన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు 88853 61812, 89190 44721 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, లయన్స్‌క్లబ్ కార్యదర్శి దానప్ప యాదవ్, మిఠాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఊరట

- మధ్యాహ్న భోజనం ధరలు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం
- విద్యాధికారులకు చేరిన సర్కారు ఉత్తర్వులు
- గత అక్టోబర్ నుంచి పెరిగిన ధరలు అమలు
- సంతోషం వ్యక్తంచేస్తున్న ఏజెన్సీల నిర్వాహకులు



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన బిల్లుల ధరలు పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మిడ్ డే మీల్స్ రేట్లు పెంచాలని అనేక విజ్ఞప్తులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పెంచిన రేట్లను అక్టోబర్ నెలనుంచి చెల్లించనున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంతో వంట ఏజెన్సీలకు ఊరట లభించింది. మండలంలో 7 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 38 ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది.

దౌల్తాబాద్‌లో ఇదీ పరిస్థితి

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4,650 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం సన్నబియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. వంట నిర్వాహకులే కూరగాయలు, కోడిగుడ్లు, పప్పులు, కారం, నూనె వంటి నిత్యావసర సరుకులు సమకూర్చుకుంటున్నారు. కొన్నేళ్లుగా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం బిల్లులు పెంచకపోవడం, గౌరవ వేతనాలు సకాలంలో అందకపోవడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు గతంలో ఒక్కో విద్యార్థికి రూ.4.97 చెల్లించగా.. ప్రస్తుతం ఈ మొత్తాన్ని రూ.5.46కు పెంచారు. 6నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి గతంలో రూ.7.45 చెల్లించగా ప్రస్తుతం రూ.8.47 ఇవ్వనున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు గతంలో రూ.9.95 ఉండగా ఇక నుంచి రూ.10.67 చెల్లించనున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమకు మేలు చేస్తుందని నిర్వాహకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఏజెన్సీలకు మేలు

కోడిగుడ్లు, నూనె, ఉప్పు, కారం, పసుపు ధరలు అమాంతం పెరగడం ఏజెన్సీలకు భారంగా మారింది. దీనికి తోడు నెలల తరబడి వేతనాలు, బిల్లులు రాక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం వీరికి కొంత వెసులుబాటు కల్పించినట్లయ్యింది. పెరిగిన ధరలతో నాణ్యమైన భోజనం అందిస్తామని పేర్కొంటున్నారు.

ధరల పెంపు హర్షణీయం



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన ధరలు పెంచడం సంతోషంగా ఉంది. పెరిగిన నిత్యావసర ధరలతో ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందించడం కష్టంగా ఉండేది. ఎట్టకేలకు ధరలు పెంచడం మంచి నిర్ణయం. విద్యార్థులకు మెరుగైన భోజనం అందిస్తాం.

– పద్మమ్మ, బాలంపేట

ఉత్తర్వులు అందాయి



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా ధరలు పెంచుతున్నట్లు సర్క్యులర్ అందింది. వంట ఏజెన్సీలు మెనూ ప్రకారం భోజనం అందించాలి. గత అక్టోబర్ నెల నుంచి ఈ రేట్లు అమలవుతాయి. భోజన తయారీలో నిర్లక్ష్యం చేయకూడదు.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

క్లుప్తంగా

భార్య రాదనే మనస్తాపంతో ఆత్మహత్య


శ్రీకాంత్(ఫైల్)

ధారూరు: గొడవ పడి పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాదనే మనస్తాపంతో ఓ ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధారూరు మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ కథనం మేరకు.. ధారూరు గ్రామానికి చెందిన పోటరీ శ్రీకాంత్(32) వికారాబాద్ మండలం అత్తెల్లి గ్రామానికి చెందిన అరుణను వివాహం చేసుకున్నాడు. రెండు నెలలుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం అరుణ పుట్టింటికి వెళ్లిపోయింది. అత్తింటి వారు పంచాయితీ పెట్టి విడిపోయేలా ఒప్పందం చేసుకున్నారు. భార్యకు రూ. 2 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఫిబ్రవరి నెలలో డబ్బులు ఇచ్చేలా ఇరువర్గాలు ఒప్పుకున్నాయి. తన భార్య కాపురానికి రాదని, శాశ్వతంగా వెళ్లిపోయిందనే మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇసుక ట్రాక్టర్

పెద్దేముల్: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం రాత్రి పట్టుకొని సీజ్ చేశారు. ఎస్ఐ అబ్దుల్‌రవూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల, పెద్దేముల్ మండలం రేగొండి -బిజ్జారం గ్రామ శివారులోని వాగు నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్నారు. ఏఎస్ఐ నారాయణ మంబాపూర్ వద్ద పట్టుకొని పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదివారం ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

శంకర్‌పల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన చాకలి మహేందర్ మద్యానికి బానిసయ్యాడు. అప్పులు చేసి మద్యం సేవించేవాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి భార్య సంధ్య, పిల్లలతో గొడవ పడ్డాడు. వారిని బయటకు వెళ్లగొట్టాడు. అర గంట తర్వాత భార్య ఇంట్లోకి వెళ్లి చూడగా భర్త ఉరివేసుకొని కనిపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

శంకర్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన పున్నయ్య రెండు సంవత్సరాలుగా మేస్త్రీ పని చేసుకుంటూ శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురంలో ఉంటున్నాడు. అక్టోబర్‌లో తన అన్న కుమారుడు నవబాబు(16)ను తన ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ నెల 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాబు తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

వామ్మో.. ఈజీఎస్ పనులా!

- జిల్లాలో 386 పనులకు రూ. 32.89కోట్లు మంజూరు
- మిగిలింది రెండు నెలల గడువే
- అప్పట్లోగా పనులు పూర్తవ్వాలి
- అందని గత ఏడాది బిల్లులు


ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

తాండూరు: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాగానే ప్రజా ప్రతినిధులు, నాయకులు వర్క్ ఆర్డర్ పొందేందుకు పోటీ పడేవారు. అయితే రెండేళ్లుగా ప్రభుత్వ పనులంటేనే హడలిపోతున్నారు. ముఖ్యంగా ఎన్ఆర్ ఈజీఎస్ గ్రాంట్‌పై సర్వత్రా విముఖత వ్యక్తం చేస్తుండడం గమనార్హం. గతేడాది చేసిన ఈజీఎస్ పనులకు ఇంకా బిల్లులు అందలేదు. మరోవైపు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు రూ. 32.90 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(మార్చి చివరి నాటికి) ముగిసేలోపు పనులు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు అందాయి. అయితే గతేడాది చేసిన పనులకు రూ. 15కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 20 మండలాలు 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పంచాయతీ రాజ్ శాఖకు రూ. 32.89 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో సీసీ రోడ్లు వేయాల్సి ఉంటుంది. అయితే ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకున్న గ్రామాలకు అధిక ప్రాధాన్యత కల్పించారు. కేవలం రెండు నెలల వ్యవధే ఉండడంతో రోడ్డు పనులు పూర్తి అవుతాయా అనే అనుమానం తలెత్తుతోంది. అంతేకాకుండా అధికారులపై పని ఒత్తిడి కూడా పెరిగింది.

పెండింగ్ బిల్లులు రూ. 15కోట్లు

గతేడాది జిల్లాలో రూ. 30 కోట్లతో సీసీ రోడ్లు వేశారు. అయితే ఉపాధి హామీ మెటీరియల్ కంపోనెంట్ ద్వారా చేపట్టిన పనులకు టెండర్లు కాకుండా నామినేషన్ పద్ధతిన స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అధికార పార్టీ నాయకులకు పనులను అప్పగించి పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లుల కోసం ప్రజా ప్రతినిధులు, నాయకులు.. ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రూ. 30కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 15 కోట్లు మాత్రమే చెల్లించారు.

కొత్త పనులు ప్రారంభిస్తాం



2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి కంపోనెంట్ గ్రాంట్ ద్వారా రూ. 32.90 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీ రోడ్లు వేయాలి. ఇందు కోసం మండలాల వారీగా నిధులను కేటాయించాం. త్వరలో పనులను మొదలు పెడతాం. గతేడాది సీసీ రోడ్డు పనులు పూర్తి చేసిన పనులకు తాము ఎంబీ రికార్డు చేసి పంపించాం. ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కావాల్సి ఉంది.

– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్, వికారాబాద్ జిల్లా

విద్యార్థిని మృతి బాధాకరం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: నిమోనియా వ్యాధితో విద్యార్థిని అంబిక మృతి చెందడం బాధాకరమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండలం రాంపూర్ పంచాయతీ గండిచెరువు తండాకు చెందిన అంబిక శుక్రవారం నిమోనియా వ్యాధి బారిన పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం ఎమ్మెల్యే బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిని మృతి దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రాతిపాదికన ఒకరికి ఉద్యోగం, అలాగే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం గోరిగడ్డ తండాకు చెందిన ఓబ్యానాయక్ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, దోమ ఎంఈఓ హరిశ్చందర్, నాయకులు పులిరాములు, తిమ్యా, మోతీలాల్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలు ఐక్యంగా ఉండాలి

పరిగి: విశ్వర్మలందరూ ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో ఆల్ ఇండియా విరాట్ విశ్వకర్మ ఉమెన్ యూత్ ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్వకర్మల అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. విశ్వకర్మలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ఉండి సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐవీఎఫ్ తెలంగాణ ఇన్‌చార్జ్ ఎం శ్రీనివాస్, కార్పెంటర్ అసోసియేషన్ పరిగి టౌన్ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.


కుల్కచర్ల: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం


విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మాదారం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్లకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. క్రీడలు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. క్రీడలు వల్ల గ్రామాల, జిల్లా, రాష్ట్రాల మధ్య తత్సంబంధాలు పెరుగుతాయన్నారు. అంతేకాకుండా క్రీడాల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోట పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు అండగా..

- విశ్రాంత ఉపాధ్యాయుడి ఉదార స్వభావం
- తల్లిదండ్రులు లేని పిల్లలకు రూ. 25వేల చొప్పున ఆర్థిక సాయం


చిన్నారికి నగదు అందజేస్తున్న దాత గాజుల బస్వరాజ్

కొడంగల్: తాండూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గాజుల బస్వరాజ్ తనకు వస్తున్న ఫించన్ డబ్బుల్లో నుంచి పాతిక వేలు అనాథ పిల్లలకు ఆర్థిక సాయం చేసి ఉదార స్వభావం చాటుకున్నారు. ఆదివారం పట్టణంలోని సిద్ధార్థ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొడంగల్ మండల పరిధిలోని కొడంగల్, పాత కొడంగల్, టేకుల్‌కోడ్, ఐనన్‌పల్లి, బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామాలకు చెందిన తల్లిదండ్రులు లేని చిన్నారులకు ఒక్కో కుటుంబానికి ఐదు వేల చొప్పున ఐదు కుటుంబాలకు రూ. 25వేలు ఆర్థిక సాయం అందించారు. వికారాబాద్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్రాయాదవ్, తెలంగాణా విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ చేతుల మీదుగా నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా తనకు వస్తున్న పింఛన్ డబ్బుల నుంచి 70శాతం డబ్బులు పేదల సేవకు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెలలో ఒక రోజు తాండూరులో అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. తనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, తన పిల్లలు ఉద్యోగ రీత్యా స్థిర పడ్డారని తెలిపారు. తన శేష జీవితంలో సేవ చేసి తరించాలని భావిస్తున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ రవీంద్రాయాదవ్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో సుమారు 800 మంది టీబీ రోగులు ఉన్నారని తెలిపారు. వారికి ప్రతి నెలా కేంద్ర ప్రభుత్వం రూ.500 నగదు అందిస్తున్నట్లు చెప్పారు. దాతలు ఎవరైనా ఉంటే ఒక్కో టీబీ రోగికి నెలకు మరో రూ.500 విలువ గల న్యూట్రిషియన్ కిట్లు ఇవ్వాలని కోరారు. కొడంగల్‌కు చెందిన సత్యసాయి సేవా సమితి సభ్యుల సహకారంతో పాటు మరి కొంతమంది దాతల సహకారంతో 30 టీబీ రోగులకు ప్రతి నెలా న్యూట్రిషియన్ కిట్లు ఇస్తున్నట్లు చెప్పారు. టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణా విద్యావంతుల వేదిక, కిసాన్ బంధు సభ్యుల సహకారంతో రైతు కుటుంబాలకు, తల్లిదండ్రులు లేని అనాథలకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. కరోనా సమయంలో కిసాన్ బంధు సహకారంతో ఆక్సిజన్ మిషన్లు, మెడికల్ కిట్లు, ఇతర ఇతర సామగ్రి అందించినట్లు చెప్పారు. టీబీ రోగులకు సాయం చేయడానికి తమవంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, కన్నయ్య, అనిల్, గోపీనాథ్, మంబాపూర్ వెంకట్, సులేమాన్, లక్ష్మి, విజయలక్ష్మి, పృథ్విసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ బాధ్యత షీ టీమ్స్‌దే

షీ టీమ్ డీసీపీ శిరీష

బడంగ్‌పేట్: విద్యార్థులకు జ్ఞానాన్ని ఇవ్వడమే కాదు సమాజంలో ఉన్న రుగ్మతలను ధైర్యంగా ఎదుర్కొనే సత్తాను పెంచే విషయ పరిజ్ఞానాన్ని కూడా అందించే బాధ్యత ప్రతి పాఠశాల సిబ్బందిపై ఉందని షీ టీమ్ డీసీపీ సీ శిరీష సూచించారు. బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్‌ను షీ టీమ్స్ అధికారులు సందర్శించారు. చేయి చేయి కలుపుదాం – ఈవ్‌టీజింగ్‌ను అరికడదాం అని నినాదాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ డీసీపీ మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలో మహిళల రక్షణ, భద్రత కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్స్ వారికి అన్ని విధాలా అండగా ఉంటోందన్నారు. ఈవ్‌టీజింగ్‌కు విద్యార్థినులు, బాలికలు, మహిళలు భయపడరాదని సూచించారు. ఆపదలో ఉన్నా సీరియస్ ఇష్యూ అయినా షీ టీమ్స్ మీకు అండగా ఉందన్న విషయాన్ని మరచిపోకూడదని తెలిపారు. ఎక్కడ మీపై ప్రత్యక్ష, పరోక్ష, దాడులు, లైంగిక వేధింపులు జరిగినట్లయితే వెంటనే డయల్ 100కు, లేదా 9490616555, 040 27852355 నెంబర్లకు కాల్ చేస్తే వెంటనే మా బృందం అక్కడికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని రక్షిస్తుందని భరోసా ఇచ్చారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. నైతిక విలువల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. షీ టీమ్స్ అంటే పోలీస్ డిపార్ట్‌మెంటేనని తెలిపారు. మహిళా పోలీసులతో ఈ షీ టీం పనిచేస్తుందని పేర్కొన్నారు. షీ టీమ్స్‌ను ఎలా అప్రోచ్ కావాలో ఫోన్ నెంబర్లతో సహా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైలజారెడ్డి, ఉమెన్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ గీత గోటి, షీ టీమ్స్ అధికారి అనందిత, షీ టీమ్స్ బృందం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: యువత రాజకీయాల్లోకి రావాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యేను ముంబైకి చెందిన వినాయక గణేష్‌వాజ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు కలిశారు. అసైన్‌మెంట్‌లో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన ముగ్గురు ప్రొఫెసర్లు, 30మంది విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

సాగుపై నమ్మకం.. ధరలు అధికం


ఎన్కేపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

- జొన్న, మొక్కజొన్నపై రైతుల్లో ఆసక్తి
- ఏటేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఆశించిన మేర దిగుబడులు

మోమిన్‌పేట: జొన్న, మొక్కజొన్న పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. యాసంగిలో సాగు చేయడం వల్ల దిగుబడులపై భరోసా ఏర్పడుతోందని, అంతేకాకుండా మార్కెట్‌లో స్థిరమైన ధరలు ఉండటంతో సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో అధిక వర్షాలు కురవడంతో భూగర్భజలాలు వృద్ధి చెందాయి. ఎండిన బోరు బావులు సైతం రీ చార్జ్ అవ్వడంతో తిరిగి నీరు పోస్తున్నాయి. కూరగాయల సాగుకు బదులు జొన్న, మొక్కజొన్న సాగే మేలంటున్నారు. మండల పరిధిలోని దాదాపు 2వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న సాగు అవుతోంది. జొన్న ఎకరాకు 10క్వింటాళ్లు, మొక్కజొన్న ఎకరాకు 40క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ స్థిరమైన ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. పంటను కేవలం అడవి పందుల నుంచి రక్షించుకుంటే చాలని చెబుతున్నారు. పంటకు నాలుగు నుంచి ఆరు నీటి తడులు ఇస్తే సరిపోతుందని, శ్రమ కూడా తక్కువేనని అంటున్నారు.

రెండెకరాల్లో సాగు చేశా



వానాకాలం సీజన్‌లో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్క జొన్న సాగు చేయగా భారీ వర్షాలు కురవడంతో పెట్టుబడులు రాలేదు. ప్రస్తుత యాసంగిలో ఎకరా ఆలుగడ్డ, రెండు ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశా. పెద్దగా పెట్టుబడులు పెట్టలేదు. కూలీల ఖర్చు కూడా తక్కువే. మార్కెటులో క్వింటాలుకు రూ.2వేలు అమ్మినా స్థిరమైన ఆదాయం వస్తుందని నమ్మకం.

– కౌలు రైతు ఆనందం, ఎన్కేపల్లి

పెట్టుబడి తక్కువే



వానాకాలం సీజన్‌లో పత్తి సాగు చేశా. ఎకరన్నర లో 12 క్వింటాళ్ల పత్తి వచ్చింది. ప్రస్తుతం పత్తి తీసి మొక్కజొన్న సాగు చేశా. పంట ఏపుగా ఉంది. పెట్టుబడి తక్కువే. దిగుబడులు, మార్కెటు ధర స్థిరంగా ఉండటం వలన మొక్కజొన్న సాగు చేశా. యాసంగిలో అడవి పందుల నుంచి రక్షించుకోవడం పెద్ద సమస్య కాదు.

– నర్సింహులు రైతు, ఎన్కేపల్లి

నగరానికి వెళ్లాలంటే నది దాటాల్సిందే

గ్రామీణులకు తప్పని తిప్పలు

- 25 కిలోమీటర్ల చుట్టూ తిరిగి వెళ్తున్న ప్రజలు
- అడాల్‌పూర్ వద్ద కాకరవేణినది పై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్


రుక్మాపూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి


అడాల్‌పూర్ సమీపంలో ప్రవహిస్తున్న కాకరవేణి నది

యాలాల: నగరానికి వెళ్లాలంటే అడాల్‌పూర్ పరిధిలో ఉన్న కాకరవేణి నది దాటాల్సిందే.. నది ఇటు వైపు ఉన్న గ్రామాల ప్రజలు నది అటువైపు ఉన్న రైల్వేస్టేషన్‌కు రోజు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో కూలీలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు అధికంగా ఉన్నవారే. వేసవి మినహా మిగతా కాలాల్లో నదిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో దాటేందుకు వీలు లేక దాదాపు 25 కిలోమీటర్లు చుట్టూ తిరిగి తాండూరు పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

మండల సరిహద్దులో..

యాలాల, పెద్దేముల్ మండల పరిధిలో కాకరవేణి నది ఉంది. నది అవతలి వైపు రుక్మాపూర్ రైల్వేస్టేషన్ ఉంది. యాలాల మండల పరిధిలోని అడాల్‌పూర్, బాణాపూర్, అన్నసాగర్, కమాల్‌పూర్, బిజ్జారం, బొంకూరు తదితర గ్రామాల ప్రజలు నదికి అటువైపు ఉన్న రైల్వేస్టేషన్‌కు వెళ్లి దూరప్రాంతాలకు వెళుతుంటారు. నదిలో నడుములోతు నీళ్లు ఉండటంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు నది దాటేందుకు అవస్థలు పడుతున్నారు. రైల్వే మార్గాన ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, కూలీలు నగరంతో పాటు తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే సమస్య శాశ్వతంగా పరిష్కారానికి వీలుంది. బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఇటు గ్రామస్తులతో పాటు విద్యార్థులకు, రైతులకు ఎంతో వెసులుబాటు అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రోజూ ఇబ్బందులే



రోజు నది దాటి అటువైపు ఉన్న రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మాకు రోడ్డు మార్గం కంటే రైల్వే మార్గమే దగ్గరవుతుంది. హైదరాబాద్, తాండూరు లాంటి ప్రాంతాలకు వెళ్లాలంటే లోకల్ ట్రైన్‌లలో ప్రయాణం ఎక్కువగా ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణం చేపడితేనే సమస్యకు పరిష్కారం. ఉన్నతాధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

– శేఖర్, అడాల్‌పూర్

చుట్టూ తిరిగి వెళ్తున్నాం



కాకరవేణి నదిలో నీళ్లు ఉండటంతో రైల్వేస్టేషన్ వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో 25 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో ఈ సమస్య జఠిలంగా ఉంటుంది. గతంలో ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాం. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– సునీల్, బాణాపూర్